# క్రీడలతో మానసికోల్లాసం

## జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

నందిపేట్, డిసెంబర్ 8: క్రీడలు మానసికోల్లాసం, శరీర ధారుడ్యానికి తోడ్పడుతాయని జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. మండలంలోని గీత కాన్వెంట్ ఆవరణలో శుక్రవారం రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలను ప్రారంభించారు. కార్యక్రమానికి జడ్పీచైర్మన్‌తోపాటు నగర పాలక మున్సిపల్ కమిషనర్ మకరంద్ హాజరయ్యారు. ముందుగా క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు జిల్లా నలుమూలాల నుంచి జట్లు పాల్గొననున్నాయి. సుమారు 500 మంది క్రీడాకారులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలు రెండు రోజుల పాటు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాఘవరెడ్డి, కృష్ణమూర్తి, ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భూమారెడ్డి, చైర్మన్ అనిల్, పరిశీలకులు లింగన్న, బొబ్బిలి నర్సయ్య, కన్వీనర్ కానూరి గంగాసాగర్, సుజాత పాల్గొన్నారు.



క్రీడల జెండాను ఆవిష్కరిస్తున్న జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

# బోర్గాం (పీ) పాఠశాలను పరిశీలించిన అధికారులు



ఉపాధ్యాయులతో మాట్లాడి వివరాలను నమోదు చేసుకుంటున్న అధికారులు



పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

- **వంట సామగ్రి, తాగునీటి శాంపిళ్ల సేకరణ**
- **విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో..**

మోపాల్ (ఖలీల్‌వాడి), డిసెంబర్ 8 : మోపాల్ మండలంలోని బోర్గాం (పీ) జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు గురువారం మధ్యాహ్నం అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ సుదర్శనం ఆదేశాల మేరకు ముదక్‌పల్లి పీహెచ్‌సీ పరిధిలోని పాఠశాలను జిల్లా ఎపెడమిక్ సెల్ విభాగం డాక్టర్ బి.రాజేశ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజన, బీహెచ్‌ఈ ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ఆశిశ్, డాక్టర్ సంతోష్ శుక్రవారం పరిశీలించారు. పాఠశాలలోని వంటగది, వంట సామగ్రిని, వంటలో వాడే సామగ్రి, తాగునీటితో పాటు పరిసరాల శుభ్రతను పరిశీలించి శాంపిళ్లను సేకరించారు. పాఠశాలను పరిశుభ్రంగా ఉంచాలని, నాణ్యమైన వస్తువులను భోజనానికి వినియోగించాలని ప్రధానోపాధ్యాయిని ధనలక్ష్మికి సూచించారు. అస్వస్థతకు గురైన 16 మంది విద్యార్థులను జిల్లా కేంద్ర ప్రభుత్వ దవాఖానకు తరలించామని, శుక్రవారం ఉదయం 12 మందిని, సాయంత్రం మరో నలుగురిని డిశ్చార్జ్ చేసి వారి ఇండ్లకు పంపామని అధికారులు తెలిపారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలికి పలు సూచనలు చేశారు.

అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, ఆహార కల్తీ, చేతుల శుభ్రంగా కడుక్కోవడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ఆసీస్, డాక్టర్ సందీప్, డాక్టర్ మాధవి, ఎంఈవో రామారావు, పీజీహెచ్‌ఎం శంకర్, ఆరోగ్య పర్యవేక్షకుడు గంగాధర్, ఏఎన్‌ఎం వనజ, ఆశకార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కేవైసీ అప్‌డేట్ కోసం బారులు



గ్యాస్ ఏజెన్సీలో కేవైసీ కోసం బారులు తీరిన వినియోగదారులు

శక్కర్‌నగర్, డిసెంబర్ 8: బోధన్ పట్టణంలోని గ్యాస్ ఏజెన్సీల వద్ద ఉజ్వల యోజన వంట గ్యాస్ వినియోగదారులు కేవైసీ అప్‌డేట్ కోసం బారులు తీరుతున్నారు. కేవైసీ నమోదు కోసం గంటల తరబడి ఏజెన్సీల వద్ద నిలబడుతున్నారు.

## బాలల హక్కులపై అవగాహన

భీమ్‌గల్, డిసెంబర్ 8 : మండలంలోని బడా భీమ్‌గల్ జడ్పీహెచ్‌ఎస్‌లో బాలల హక్కులులపై శుక్రవారం అవగాహన కల్పించారు. మానవ అక్రమ రవాణా తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆపద సమయంలో 1098, 100, 108 హెల్ప్‌లైన్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాలతో జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ జ్యోత్స్న, సాయిలు కల్పించారు. కార్యక్రమంలో సీడీపీవో సుధా, ఎసీడీపీవో స్వర్ణలత, సూపర్‌వైజర్ రమాదేవి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అజయ్, ఏఎస్‌ఐ చిరంజీవి, హైస్కూల్ హెచ్‌ఎం కృష్ణస్వామి, బడా భీమ్‌గల్ సర్పంచ్, కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మొక్కలను జాగ్రత్తగా కాపాడాలి



హసాకొత్తూర్‌లో నర్సరీని పరిశీలించిన సర్పంచ్ నుగు పద్మా రాజేశ్వర్

కమ్మర్‌పల్లి, డిసెంబర్ 8: హరితహారం నర్సరీల్లో మొక్కలను జాగ్రత్తగా కాపాడాలని మండలంలోని హసాకొత్తూర్ సర్పంచ్ ఏనుగు పద్మా రాజేశ్వర్ అన్నారు. శుక్రవారం హసాకొత్తూర్‌లో నర్సరీని ఆమె పరిశీలించారు. మొక్కలు పెంచడానికి మట్టిని నింపిన పాలిథీన్ బ్యాగులను పరిశీలించారు. హరితహారం కార్యక్రమంలో నర్సరీలను చక్కగా నిర్వహించడం ఎంతో కీలకమన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

## రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

బోధన్ రూరల్, డిసెంబర్ 8: యాసంగిలో చలి ప్రభావం నుంచి వరి నారును కాపాడుకోవడానికి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని బోధన్ వ్యవసాయ అధికారి సంతోష్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం చలి ప్రభావం ఎక్కువ ఉండడంతో కొత్త నీటిని పెడుతూ పాట నీటిని వదలాలని అన్నారు. చలికి పోషకాలు మొక్కలకు అందకపోవడంతో కొన్నిసార్లు జింకులోపంతో ఆకులపై తుప్పుమచ్చలు ఏర్పడుతాయన్నారు. వాటి నివారణకు రెండు గ్రాముల జింక్ సల్ఫేట్‌ను లీటరు నీటిని కలిపి పిచికారీ చేయాలన్నారు.

## ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి, డిసెంబర్ 8 : ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి బ్యూటీపార్లర్, మగ్గం వర్క్, టైలర్ శిక్షణ ప్రారంభమవుతుందని డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19 నుంచి 45 ఏండ్ల వయస్సు కలిగి ఉండి, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల గ్రామీణ ప్రాంతం వారు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో భోజనం అందజేస్తామని, హాస్టల్ వసతి ఉచితంగా ఉంటుందని తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తోపాటు టూల్‌కిట్‌ను అందజేస్తామని పేర్కొన్నారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 08461–295428 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

## పెద్ద రాంమందిర్‌లో ప్రత్యేక పూజలు



అక్షింతల ఊరేగింపులో పాల్గొన్న పిట్ల కృష్ణ మహరాజ్

నిజామాబాద్ కల్చరల్, డిసెంబర్ 8 : నగరంలోని బ్రహ్మపురిలో ఉన్న పెద్ద రాంమందిర్‌లో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర అయోధ్య అక్షింతల పూజా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా హాజరై మాట్లాడారు. అయోధ్య శ్రీరామమందిరంలో ప్రాణప్రతిష్ఠ జరిపిన అక్షింతలను జిల్లా కేంద్రానికి తీసుకువచ్చినట్లు తెలిపారు. అంతకుముందు అక్షింతల కలశాన్ని వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో బోర్గాం బ్రిడ్జి నుంచి పెద్ద రాంమందిర్ వరకు బైక్ ర్యాలీతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో మల్లారం లింగేశ్వర గుట్ట ఆశ్రమ పీఠాధిపతి పిట్ల కృష్ణ మహరాజ్, అందాపూర్ స్వామి, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు దినేశ్ ఠాకూర్, కార్యదర్శి టి. కృష్ణ, గాజుల దయానంద్, రెబ్బ ఆనంద్, ధాత్రిక రమేశ్, అరుణ్‌రెడ్డి, హింధూ వాహిని జిల్లా అధ్యక్షుడు అనిల్, శ్రీకాంత్, శివాజీ యూత్ అధ్యక్షుడు లక్ష్మణ్, రాంప్రసాద్ చటర్జీ, ఆర్మూర్, బాల్కొండ కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి

నందిపేట్, డిసెంబర్ 8: నందిపేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శాపూర్ శివారులో గుర్తుతెలియని వ్యక్తి శనివారం ఉదయం 11 గంటలకు కొన ఊపిరితో ఉండగా 108లో జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందినట్లు ఎస్సై రాహుల్ శుక్రవారం తెలిపారు. మృతుడికి సుమారు 55 ఏండ్ల వయస్సు ఉంటుందని, సుమారు ఐదున్నర అడుగుల ఎత్తు, చామనచాయా శరీర రంగు ఉందని , ఒంటిపై లేత పసుపు రంగు ఫుల్ హ్యాండ్ షర్ట్, నలుపు రంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. ప్రస్తుతం మృతదేహం జిల్లా ప్రభుత్వ దవాఖాన మార్చురీలో ఉందని, మృతుడి సంబంధీకులుంటే 8712659861 నంబరులో సంప్రదించాలని కోరారు.

## ప్రమాదవశాత్తు పడి యువకుడు..

ఎడపల్లి, డిసెంబర్ 8: మండల కేంద్రంలో ఓ యువకుడు ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఆరే శేఖర్(33) ఓ ప్రైవేటు కంపెనీలో సెక్యురిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. మద్యానికి అలవాటు పడి తాగిన మైకంలో తల్లిని, భార్యను కొట్టేవాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం పనిమీద మంగళపాడు చౌరస్తాకు నడుచుకుంటూ వెళ్లాడు. తిరిగి ప్రయాణంలో చౌరస్తాలో ప్రమాదవశాత్తు పడడంతో ఫిట్స్ వచ్చి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య విజయ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

## బోధన్‌లో బైక్ చోరీ

శక్కర్‌నగర్, డిసెంబర్ 8: బోధన్ పట్టణం కుమ్మర్‌గల్లీలో ఉంటున్న కోట అబ్బయ్య అనే వ్యక్తికి చెందిన మోటార్ సైకిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈనెల 5న రాత్రి తాను అద్దెకుంటున్న ఇంటి ఎదుట వాహనం నిలిపి రాత్రి పడుకున్నాడు. తిరిగి తెల్లవారు జామున 4 గంటలకు లేచి చూడగా బైక్ కనిపించక పోవడంతో చుట్టుపక్క ప్రాంతాల్లో గాలించాడు. అనంతరం బోధన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బైక్ చోరీ విషయంలో పోలీసులకు ఫిర్యాదు చేసి మూడు రోజులైందని బాధితుడు తెలిపారు.

**ఆర్మూర్‌లో ...**

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్8: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో పిట్టల చందుకు చెందిన పల్సర్ బైక్ శుక్రవారం తెల్లవారుజామున చోరీకి గురైంది. ఇంటి వద్ద నిలిపి ఉంచిన బైక్‌ను దొంగలు ఎత్తుకెళ్లిన్నట్లు బాధిత కుటుంబ సభ్యులు వాపోయారు. పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.